క్లుప్తంగా

విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఆంధ్ర ప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలు రు)స్కూల్ విద్యార్థులకు బుధవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులు, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో స్వామివారి ప్రచార రథం



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రచార రథం తాడేపల్లె గూడెం ఉంగుటూరు మండలంలోని గ్రామాల్లో గురువారం పర్యటించింది. ఉదయం ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు, నారాయణపురం, కైకరం గ్రామాల్లో ప్రచార రథం పర్యటించగా భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

నక్షత్ర వనంలో ప్రత్యేక పూజలు



నక్షత్ర వనంలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ నక్షత్ర వనంలో పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి వెళ్లే 100 అడుగుల రహదారికి ఇరువైపులా మొక్కలను నాటారు. అనంతరం 2023 వార్షిక బ్రహ్మోత్సవాలు విజయంతంగా నిర్వహించిన ఆలయ అధికారులకు, అర్చకులకు, వేదపండితులకు, సిబ్బందికి దుస్తులు అందించారు. ఆలయ ఆవరణంలోని నక్షత్ర వనంలో ఉసిరి చెట్లకు పూజలు చేసి, అందరికీ కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఉప సర్పంచ్ విశ్వనాథ రెడ్డి, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, నాయకులు రవి, సుధీర్, గోపినాథ్ పాల్గొన్నారు.

బీజేపీ కన్వీనర్‌గా మోహన్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా రూరల్ మండలం ఎగువ మాసపల్లెకు చెందిన ఏనుగులవారి మోహన్‌నాయుడును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి



పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు

తవణంపల్లె: పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు వైద్యాధికారులను ఆదేశించారు. తవణంపల్లె పీహెచ్‌సీని బుధవారం జిల్లా ఇమ్యూనైజేష్ అధికారి డాక్టర్ రవిరాజు, జిల్లా క్షయ నివారణ, హెచ్ఐవీ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్‌తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సిబ్బంది హాజరు రిజిస్టర్, పీహెచ్‌సీ రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. క్షయవ్యాధి నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా టీబీ, హెచ్ఐవీ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ తెలిపారు. టీబీకి సంబంధించి పీహెచ్‌సీ నుంచి వారానికి 10 శాంపుల్స్ తీసి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వైద్యాధికారులు ప్రియాంక, వినయ్‌కుమార్, మోహన్‌వేలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు

కాణిపాక(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వెంకటేశు పూతలపట్టు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ చైర్మన్ అతిథి గృహంలో ఆలయ ఈఓ, ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈఓ పదవీకాలం పొడిగించినందున శాలువ కప్పి స్వీట్లు అందించి కృతజ్ఞతలు తెలిపారు.

కదలని 'కారుణ్య' దస్త్రం



"ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు ధనలక్ష్మి. ఈమె భర్త బి.రామచంద్ర చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని ప్రజారోగ్య విభాగంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 8న చనిపోయాడు. ముగ్గురు కుమార్తెలున్న ఈమెకు ఎలాంటి జీవనాధారం లేకుండా పోయింది. ఈమె కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటే అతీగతీలేదు. కనీసం పెన్షన్ వస్తే కుటుంబాన్ని పోషించడానికి కాస్త భరోసా ఉంటుందని చెబుతున్నా పట్టించుకోవడంలేదు. ప్రజారోగ్య విభాగం చుట్టూ ఆమె కుమార్తెతో కలిసి తిరుగుతున్నా ఇక్కడి మనసులు కరగడంలేదు.''



చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

- పరాకాష్టకు చేరిన ఉద్యోగుల నిర్లక్ష్యం
- కారుణ్య నియామకాల కోసం బాధితుల నిరీక్షణ
- పెన్షన్ ప్రతిపాదనలు.. ఇంక్రిమెంట్లలో నిర్లక్ష్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ప్రజారోగ్యశాఖ విభాగంలో నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల నుంచి ఏం ఆశిస్తున్నారో? ఎందుకోగానీ..! కారుణ్య నియామకాల ఫైలును తొక్కిపెడుతున్నారు. ఉద్యోగులకు అందాల్సిన ప్రోత్సాహకాలు సకాలంలో ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారు. అసలు విషయాన్ని కమిషనర్ వరకు వెళ్లకుండా దాచేస్తున్నారు. ఫలితంగా సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగిని ఇటీవల సస్పెండ్ చేస్తూ కమిషనర్ అరుణ ఆదేశాలు జారీ చేశారు. కానీ శాఖాధిపతుల మధ్య ఉన్న సమన్వయలోపాన్ని పరిష్కరిస్తే తప్ప బాధితులకు న్యాయం జరగదు.

ఉద్యోగుల్లో 'కారుణ్యం' లేదా?

వసంత అనే ఉద్యోగి ఏడాది క్రితం చనిపోతే కారుణ్య నియామకం కింద ఆమె కుటుంబానికి ఇప్పటి వరకు ఉద్యోగం ఇవ్వలేదు. ఎస్వీ.గోపాల్ అనే కార్మికుడు మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకోలేదు. రామచంద్ర చనిపోయి ఎనిమిది నెలలు గడుస్తున్నా దిక్కులేదు. రెవెన్యూ విభాగంలో బిల్‌కలెక్టర్‌గా పని చేసిన సోమశేఖర్ మరణించి మూడున్నరేళ్లు గడుస్తున్నా దస్త్రం కదలదు. అవివాహితుడని, ఇతని సోదరికి పెళ్లయ్యిందనే కుంటిసాకులతో కారుణ్య నియామకానికే అర్థాలు మార్చేస్తూ సోమశేఖర్ కుటుంబానికి ఉద్యోగం ఇవ్వడంలేదు. వాస్తవానికి కమిషనర్‌గా అరుణ ఇక్కడ బాధ్యతలు తీసుకున్న తరువాత కారుణ్య నియామకాల్లో బాధితుల విద్యార్హత ఆధారంగా జూనియర్ అసిస్టెంట్లు, బిల్‌కలెక్టర్లు, గ్యాంగ్ మజ్దూర్‌లాంటి పోస్టులను వివాదాల్లేకుండా భర్తీ చేశారు. కానీ ఇటీవల కాలంలో కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

ప్రోత్సాహకాలు ఎక్కడ?

మరోవైపు పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి ఎనిమిదేళ్లకు ఓ ప్రోత్సాహకం (ఇంక్రిమెంట్) ఇవ్వాలి. ఇక్కడ దాదాపు 30 మందికి పైగా కార్మికులకు ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. వీటిని తీసుకోవడం ఒక్కో కార్మికుడికి ఓ యుద్ధం చేసినంత పనవుతోంది. ఆడిటర్ల నుంచి బిల్లులు తయారు చేయించుకుని వచ్చినా ఓ అధికారి సకాలంలో సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విరమణ పొందిన ఉద్యోగులకు, చనిపోయిన కుటుంబ సభ్యులకు పెన్షన్ ఇవ్వడానికి ఫైళ్లను కూడా పెట్టడంలేదు మరో అధికారి. 20 ఏళ్ల, 30 ఏళ్ల క్రితం ఉద్యోగంలో చేరిన కార్మికులకు రెండేళ్ల ప్రొబేషన్ కాలం పూర్తయితే ఆ కాపీ ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతోపాటుగా కార్మికులకు పాదరక్షలు, కొబ్బరినూనె, యూనిఫామ్‌లు ఇచ్చే విషయంపై కూడా నీళ్లు నములుతూ కూర్చోవడం విమర్శలకు దారితీస్తోంది.

కార్మికులకు న్యాయం చేస్తా..



కార్మికుల సమస్యలు ఇటీవల నా దృష్టికి వచ్చాయి. నిర్లక్ష్యం చేసిన ఉద్యోగిని సస్పెండ్ చేశాం. కారుణ్య నియామకాలు, పెన్షన్, ఇంక్రిమెంట్ల ఫైళ్లు ఎక్కడ ఆగాయో పరిశీలించాలని సెక్షన్ హెడ్‌లకు చెప్పాము. వీలైనంత త్వరగా ఈ సమస్య పరిష్కారమవుతుంది. తప్పుచేసినట్లు తెలిస్తే ఎవ్వరైనా ఉపేక్షించేది లేదు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా కార్మికులకు సకాలంలో న్యాయం చేస్తాం.

–డా.అరుణ, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

ఐరాల: మండలంలోని కాణిపాకం సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరవుతారన్నారు. సచివాలయం వద్ద సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరించనున్నట్లు వివరించారు.

నేడు గుంతూరులో..

బంగారుపాళెం: మండలంలోని గుంతూరు గ్రామ సచివాలయంలో గురువారం ×ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి₹ అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ అమరావతి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

రేపు ఆడుదాం ఆంధ్రాపై సమావేశం

గుడిపాల: ఆడుదాం–ఆంధ్రా క్రీడా సంబరాలపై డిసెంబర్ 1వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు నరహరిపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మండలంలోని వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై సమావేశం ఉంటుందన్నారు. తప్పనిసరిగా ప్రతి ఒక్క వలంటీర్, కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

అభివృద్ధికి కలసికట్టుగా కృషిచేద్దాం



బంగారుపాళెం: మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి కలసికట్టుగా పని చేద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మండల సర్వసభ సమావేశానికి గైర్హాజరు కావడంపై ఎమ్మెల్యే ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమావేశం సభ్యులకు అధికారులు తెలియజేశారా లేదా అని ప్రశ్నించారు. అనంతరం సమావేశంలో ప్రజా సమస్యలపై సభ్యులు ప్రస్తావించారు. ఆ సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, బంగారుపాళెం, తగ్గువారిపల్లె, పాలేరు పంచాయతీల్లోని జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇళ్ల స్థలాలను వేరొక్కరికి అమ్ముకున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పక్కా ఇళ్లు లేక అవస్థలు పడుతున్న నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసి, పక్కా గృహ నిర్మాణానికి నగదు సాయం అందివ్వడం జరుగుతోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను ఎలా అమ్ముకుంటారన్నారు. దీనిపై హౌసింగ్, రెవెన్యూ అధికారులు విచారణ చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పార్టీలకు, రాజకీయాలకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పని చేసి, మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, ఏఎంసీ చైర్మన్ సోమశేఖర్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వీఆర్‌ఓలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: సమాజంలో అంటరానితనాన్ని రూపుమాపాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. మండలంలోని తేనేపల్లి ఎస్టీ కాలనీలో బుధవారం పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులను వినియోగించుకోవడంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిచినట్లు మాట్లాడితే చట్ట ప్రకారం శిక్ష అర్హులవుతారని పేర్కొన్నారు. ఎస్ఐ రాంభూపాల్ మాట్లాడుతూ యువకులు అధికంగా మోటారు బైకుపై అధిక వేగంతో వెళ్లకూడదని తెలిపారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ గ్రామంలో పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. అనంతరం ముఢనమ్మకాలను విడనాడాలని సూచించారు. మూఢనమ్మకాలతో చాలా మంది ప్రాణాలు పోతున్నాయని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, ఎంపీడీఓ గౌరి, ఎస్ఐ రాంభూపాల్, జెడ్పీటీసీ దేవిక, వైస్ సర్పంచ్ ఆనందయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ, స్టేషన్ రైటర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో వైద్యం





తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ధాత్రేయచౌదరి, యాదమరి: పరీక్షిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణ పేదలకు వైద్యం అందిస్తున్నామని డాక్టర్ ధాత్రేయచౌదరి అన్నారు. మండలంలోని దిగువ మోదలపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ రోగులకు వైద్య పరీక్షలు చేసి, సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. గర్భవతులు ఆస్పత్రిలో ప్రసవం చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆశావర్కర్లు సౌందర్య, పుష్ప, నాగభూషణ పాల్గొన్నారు.

బండపల్లెలో వైద్యశిబిరం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య అన్నారు. బండపల్లె గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, హేమలత, సంధ్య, కోకిల, మంజుల పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

యాదమరి: ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ గ్రామ ప్రజలను కోరారు. మండల పరిధిలోని నారాయణ కండిగ గ్రామంలో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు చికిత్సలు అందించి, ఉచితంగా మందులు అందించారు. అనంతరం వైద్యులు గ్రామ ప్రజలతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రోగుల ఇంటి వద్ద అన్ని సదుపాయాలతో చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. రక్తపరీక్షలు సైతం అక్కడే నిర్వహించి తగిన మందులు అందిస్తున్నట్లు వివరించారు. ఇలాంటి సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోజంతా కారుమబ్బులు చిరుజల్లులు

చిత్తూరు రూరల్: గత కొన్నిరోజులుగా ముసురు వర్షాలు, చిరు జల్లులు మండలాన్ని వీడడం లేదు. బుధవారం అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు కారు మబ్బులు కమ్ముకున్నాయి. వారంలో అప్పుడప్పుడు ఉదయం, మధ్యాహ్నం మాత్రం సూర్యుడు కనిపిస్తున్నాడు. వర్షం రోజంతా చిరు జల్లులుగా పడుతూ మధ్యమధ్యలో మోస్తరు స్థాయిలో కురిసింది. చలి తీవ్రత పెరిగింది. ఉదయం మాత్రం సూర్యుడు సుర్రుమనిపించి కనుమరుగయ్యాడు. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా జనం తమ రాకపోకలను కొనసాగించారు. సాయంత్రానికి మండల పరిధిలోని రోడ్లంతా జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు ప్రవహించింది.

ఘనంగా గంగమ్మ కుంభాభిషేకం



కుంభాభిషేకం పూజలో పాల్గొన్న మహిళలు

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పం గ్రామంలో బుధవారం గంగమ్మ కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట,అభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాదాలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో కుంభాభిషేకం పూజలో పాల్గొని వారి మొక్కులను తీర్చుకున్నారు. మధ్యాహ్నం, రాత్రి వచ్చిన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు.

సైబర్ నేరాలతో యువత జాగ్రత్త : ఎస్ఐ

పూతలపట్టు: మండలంలోని యువకులు సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు. మండలంలోని వావిల్‌తోటలో బుధవారం రాత్రి ఎస్ఐ రాంభూపాల్ పల్లెనిద్ర చేశారు. సాయంత్రం గ్రామస్తులతో మాట్లాడుతూ చాలా మంది యువత సైబర్ నేరాలకు బలవుతున్నారని చెప్పారు. యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్లపై వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి అక్కడే బస చేసి, స్థానిక సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వీరితో పాటు వైస్ ఎంపీపీ మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీ హయాంలో అన్ని పథకాలు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులకే లభించేవని మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సాంబయ్యకండ్రిగ, వినాయకపురం డివిజన్లలో బుధవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సచివాలయాల్లో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించి, కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాలను ఎగురవేశారు. గత టీడీపీ పాలనకు ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ అందించిన పాలనలో తేడాను గమనించాలని కోరారు. టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, నగర సచివాలయ కన్వీనర్ రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్లు హరిణిరెడ్డి, ప్రభావతి, చల్లాముత్తు నాయకులు కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం మళ్లీ రావాలి

గుడిపాల: పేదలకు మంచి చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల్లోనూ గెలవాల్సిన అవసరం ఉందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నంగమంగళం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాహుల్‌రెడ్డి, సర్పంచులు జయకోడి, గుణవతి, రజనీకాంత్, సుధాకర్ నాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులు శిలంబరసన్, రవీంద్రారెడ్డి, యోవాన్, రవి, కలైఅరసి, వెంకటేశులురెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

బంగారుపాళెం: పేదల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీపీ అమరావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని ఈచనేరిపల్లెలో బుధవారం సాయంత్రం సర్పంచ్ అనూరాధ ఆధ్వర్యంలో ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి₹ కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, జెడ్పీటీసీ సోమశేఖర్, సచివాలయ కన్వీనర్లు సుధాకర్‌రెడ్డి వెంకటేష్, ఇందు, హరి, రమేష్, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, గృహసారథులు పాల్గొన్నారు.





యాదమరి: కరపత్రాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, చిత్తూరు: వినాయకపురంలో పర్యటిస్తున్న మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పూతలపట్టులో...

పూతలపట్టు: మండలంలోని వడ్డేపల్లి పంచాయతీ పరిధిలో బుధవారం నాయకులు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు పురుషోత్తం నాయుడు, ఎంపీడీఓ గౌరి, కుమార్, నిరంజన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

దాసరాపల్లెలో..

యాదమరి: మండలంలోని కృష్ణంపల్లె, దాసరాపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. సాయంత్రం ఎంపీపీ సురేష్‌బాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీల్లో లబ్ధిదారులకు అందించిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీలు రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


జగన్‌తోనే పేదలకు సంక్షేమం

తవణంపల్లె: సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే పేదలకు సంక్షేప పథకాలు అందుతాయని జెడ్పీటీసీ సభ్యులు భారతి తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లె సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో నవరత్నాలతో అందిస్తున్న సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును పార్టీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. అనంతరం దిగువ తడకరలో వైఎస్సార్‌సీపీ నాయకులు జెడ్పీటీసీ భారతి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగుర వేశారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు హరిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీబాబు ప్రసంగించారు. అనంతరం సచివాలయంలో పార్టీ నాయకులు పల్లెనిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్, ఈఓపీఆర్‌డీ కుమార్, సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీ ఇంద్రాణి, పార్టీ నాయకులు రమణారెడ్డి, పరమేశ్వర రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, మధుకుమార్, జగన్నాథరెడ్డి, యుగంధరెడ్డి, మురుగన్, రాజశేఖర్ రెడ్డి, కోదండ, విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.











బంగారుపాళెం: పథకాలను వివరిస్తున్న నాయకులు, పూతలపట్టు: కరపత్రాలను చూపిస్తున్న నాయకులు, తవణంపల్లె: డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న అధికారులు, గుడిపాల: సమావేశానికి హాజరైన వారినుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు